క్లుప్తంగా

రాష్ట్ర స్థాయి పోటీలకు విద్యార్థులు ఎంపిక



విష్ణువర్ధన్‌తో విద్యార్థులు

సైదాపూర్: మండలంలోని సోమారం మోడల్ స్కూల్ విద్యార్థులు బెల్లి యుగేందర్, ఓంప్రకాశ్ రాష్ట్ర స్థాయి సాఫ్ట్ బాల్ పోటీలకు ఎంపికయ్యారని ఫిజికల్ డైరెక్టర్ ఉయ్యాల విష్ణువర్ధన్ శనివారం తెలిపారు. జిల్లా సీనియర్ స్థాయి పోటీల్లో ప్రతిభ కనపరిచి రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారని, భూపాలపల్లిలో నిర్వహించే పోటీల్లో పాల్గొంటారని వివరించారు. క్రీడల్లో రాణిస్తున్న విద్యార్థులను ఎంఈవో కేవీ నర్సింహారెడ్డి, ప్రిన్సిపాల్ ఫర్హానా అభినందించారు.

మోడల్ స్కూల్ సందర్శన



హాస్టల్‌ను సందర్శిస్తున్న ఎంపీపీ వినీత

చిగురుమామిడి: మండలంలోని చిన్నముల్కనూర్ ఆదర్శపాఠశాలను ఎంపీపీ కొత్త వినీత సందర్శించారు. శనివారం విద్యాకమిటీ సమావేశం సందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడారు. పాఠశాలలో నెలకొన్న సమస్యలను ప్రిన్సిపాల్ కె. శ్రీనివాస్ ద్వారా తెలుసుకున్నారు. తాగునీరు, వంటగది, ఆట స్థలంతో పాటు ఇతర సమస్యలు హుస్నాబాద్ ఎమ్మెల్యే వొడితెల సతీష్‌కుమార్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానన్నారు. కలెక్టర్‌కు విన్నవించి సకాలంలో పరిష్కారమయ్యేందుకు తనవంతు కృషి చేస్తానన్నారు. పాఠశాల ఆవరణ, హాస్టల్ పరిశీలించారు. ఆమె వెంట ప్రిన్సిపాల్ కె శ్రీనివాస్, విద్యాకమిటీ చైర్మన్ అరుణ్‌కుమార్, డైరెక్టర్ బరిగెల సదానందం పలువురు ఉన్నారు.

బ్యాంకు రుణాలు వినియోగించుకోవాలి

సైదాపూర్: బ్యాంకు రుణాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ ప్రభాకర్‌రెడ్డి సూచించారు. శనివారం స్వశక్తి భవనంలో మహిళా సంఘాల ఆర్థిక లావాదేవీల సమావేశంలో పాల్గొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో చెల్లించిన అభయహస్తం డబ్బులు ప్రభుత్వం నుంచి రావడంలేదని, గ్రామైఖ్య సంఘాల భవనాలు నిర్మించడంలేదని మహిళలు ఎంపీపీ దృష్టికి తీసుకువచ్చారు. ఎమ్మెల్యే, మంత్రి దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కరిస్తామని ప్రభాకర్‌రెడ్డి హామీ ఇచ్చారు. ఏపీఎం కుమాస్వామి, మండల సమాఖ్య అధ్యక్షురాలు రజిత, కార్యదర్శి లత, సెర్ప్ సీసీలు దేవేందర్, రమేష్, పర్శరాములు, శ్రీనివాస్‌రెడ్డి, జమున, రంజిత్, రాజేశ్వరి, కిషోర్, గీతారాణి ఉన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న సీఐ, చైల్డ్ లైన్ సభ్యులు

హుజూరాబాద్: పట్టణంలోని పోలీస్ స్టేషన్ ఆవరణలో ఆపరేషన్ స్మైల్–9కి సంబంధించిన పోస్టర్‌ను శనివారం హుజూరాబాద్ టౌన్ సీఐ బొల్లం రమేశ్ ఆవిష్కరించారు. డివిజన్ టీం ఇన్‌చార్జి ఎస్ఐ ఎండీ ఆసిఫ్ మాట్లాడుతూ తప్పిపోయిన, అనాథ పిల్లలను, విధి బాలలు, అక్రమ రవాణాకు గురవుతున్న బాలకార్మికులు, బడి బయట పిల్లలు డయల్ 100, 1098, నంబర్లు ఉపయోగించుకోవాలన్నారు. అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ చందన, ఐసీపీఎస్ సోషల్ వర్కర్ రమేష్, చైల్డ్ లైన్ 1098 సభ్యుడు దూడం కుమారస్వామి, కానిస్టేబుళ్లు బాల్రెడ్డి, ఓదెలు, సౌజన్య, అనిత ఉన్నారు.

కాలమేదైనా బురదే

- డ్రైనేజీలు లేక రోడ్డుపైకి మురుగునీరు
- ఏళ్లుగా ఇబ్బందిపడుతున్న ప్రజలు, వాహనదారులు
- ప్రత్యామ్నాయం ఉన్నా పట్టింపు కరువు
- అధికారులు, ప్రజాప్రతినిధుల తీరుపై వెల్లువెత్తుతున్న విమర్శలు



బురదమయంగా శివకేశవాలయం రోడ్డు

చొప్పదండి: పట్టణంలోని వివేకానంద చౌరస్తాలో మురుగునీరు రోడ్డుపై పారుతుండటంతో రోడ్డంతా బురదమయంగా మారుతోంది. దీంతో ప్రజలు, శివాలయానికి వెళ్లే భక్తులు బురదరోడ్డుతో ఏళ్లుగా ఇబ్బంది పడుతున్నారు. అయినా సమస్య పరిష్కరించడంలో అధికారులు, ప్రజాప్రతినిధులు నిర్లక్ష్యం వహిస్తుండటంతో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వర్షాకాలంతో పాటు మిగతా కాలాల్లోనూ బురదరోడ్డుతో అవస్థలు పడుతున్నారు. అప్పుడప్పుడు తాత్కాలికంగా మట్టి పోయడం, కొద్ది రోజులకే మళ్లీ రోడ్డు బురదమయంగా మారడం పరిపాటి. మండల కేంద్రం నుంచి మంగళపల్లి, రామడుగు మండలం వెంకట్రావుపల్లి, లక్ష్మీపూర్ గ్రామ ప్రజలతో పాటు గా యత్రి పంప్‌హౌజ్‌కు వెళ్లే వాహనదారులు సైతం నానా తంటాలు పడుతున్నారు.

- వివేకానంద చౌరస్తాలో మురుగుకాలువలు లేకపోవడంతో నీరు రోడ్డుపైకి చేరుతోంది.
- తాత్కాలికంగా మట్టి పోస్తున్నా ఉపయోగం లేదు.
- డ్రైనేజీ నిర్మించే దిశగా, రోడ్డు ఎత్తు పెంచాల్సిన అధికారులు, ప్రజాప్రతినిధులు చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారు.
- గ్రామ పంచాయతీ నుంచి మున్సిపాలిటీగా మారినా చౌరస్తాపై నజర్ వేయడం లేదు.
- రూ. 33 కోట్ల నిధులతో సెంట్రల్ లైటింగ్ పనులు చేపట్టిన అధికారులు నిత్యం రద్దీగా ఉండే రోడ్డును పట్టించుకోవడం లేదు.
- శివకేశవాలయంతో పాటు మంగళపల్లి దారి బురదమయంగా మారుతుండటంతో ఓ రైతు శివకేశవాలయానికి వెళ్లే భక్తులకు దారిలో ఉన్న శ్మశాన వాటికతో ఇబ్బంది రాకుండా ముప్పై అడుగుల కొత్త రోడ్డును ఏర్పాటు చేశారు.
- వ్యవసాయ క్షేత్రం నుంచి దారి ఏర్పాటు చేసినా రాష్ట్ర రహదారి పక్కన నక్ష దారిని వెలికితీయడానికి మున్సిపాలిటీ, రెవెన్యూ శాఖల నుంచి ఎటువంటి స్పందన రావడం లేదని కులసంఘాల అధ్యక్షులు వాపోతున్నారు.
- నిజాంకాలం నాటి నక్ష దారి ఆక్రమణకు గురైందని, దాన్ని వెలికితీయాలని ఫిర్యాదు చేసినా స్పందన కరువైందని పట్టణంలోని కులసంఘాల అధ్యక్షులు ఆరోపిస్తున్నారు.
- ఎమ్మెల్యే రవిశంకర్ రోడ్డు వెలికితీయాలని అధికారులకు సూచించినా పట్టించుకోవడం లేదు. ప్రస్తుతం ఉన్న రోడ్డును మరమ్మతు చేయాలని, ప్రత్యామ్నాయంగా కొత్త రోడ్డు యుద్ధప్రాతిపాదికన నిర్మించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

అధికారుల నిర్లక్ష్యం తగదు



పట్టణంలోని శివకేశవాలయం, పెద్దమ్మ గుడి, ఎల్లమ్మ గుడి, మడి ఎల్లయ్య గుడి, సమ్మక్క, సారలమ్మ, దుర్గామాత, సరస్వతి ఆలయాలకు వెళ్లే భక్తులకు ముప్పై అడుగుల రోడ్డు దాతలు ఇచ్చారు. పాత నక్ష ప్రకారం ఉన్న దారిని వెలికితీయడంలో రెవెన్యూ అధికారుల పక్షపాత, నిర్లక్ష్య ధోరణి తగదు.

– చీకట్ల లచ్చయ్య, చొప్పదండి

సర్వే చేయాల్సి ఉంది

వివేకానంద విగ్రహం సమీపంలో రాష్ట్ర రహదారి నుంచి లోపలికి పురాతన నక్ష దారిని కొలువాల్సి ఉంది. గతంలో ఎమ్మెల్యే ఆదేశాల మేరకు స్థలాలను పరిశీలించాం. సర్వేయర్‌కు రెండు రకాల నక్షలు అందించడంతో ఉన్నతాధికారులకు నివేదించాం. ల్యాండ్ రికార్డుల శాఖ ఏడీ ద్వారా సర్వే చేయాల్సి ఉంది.

– అంబటి రజిత, తహసీల్దార్

అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయం

ఎమ్మెల్యే సుంకె రవిశంకర్



చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రవిశంకర్

గంగాధర: ప్రజా సంక్షేమం, రాష్ట్ర అభివృద్దే ధ్యేయంగా సీఎం కేసీఆర్ అహర్నిశలు కృషి చేస్తున్నారని చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ అన్నారు. మండలంలోని గర్శకుర్తి గ్రామంలో శనివారం లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేశారు. రైతు దావనపల్లి భూమయ్య కుటుంబానికి రూ.5లక్షల రైతుబీమా ప్రొసీడింగ్ పత్రాలు అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడారు. దళిత బంధు దేశానికి ఆదర్శంగా నిలుస్తోందని, ఆడబిడ్డలకు భరోసానిచ్చేందుకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను ప్రభుత్వం ప్రవేశపెట్టిందన్నారు. రైతులు పండించిన పంటను కొనుగోలు చేయడం, పెట్టుబడి సాయం, పుట్టిన పిల్లలకు కేసీఆర్ కిట్టు, మహిళల రక్షణకు షీ టీంలు, గ్రామాల్లో మిషన్ భగీరథతో ఇంటింటికి మంచినీరు అందిస్తున్నామని పేర్కొన్నారు, పల్లె ప్రకృతి వనం, హరితహారం, మిషన్ కాకతీయ పథకంతో చెరువులు కళకళలాడుతున్నాయని అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ అలువాల నాగలక్ష్మీ, ఎంపీటీసీ రజిత, ప్రజాప్రతినిధులు,నాయకులు పాల్గొన్నారు.

చొప్పదండి: పట్టణానికి చెందిన సామల భిక్షపతికి ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కు మంజూరైంది. శనివారం ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ తన నివాసంలో లబ్ధిదారుడికి అందించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ శాఖ అధ్యక్షుడు లోక రాజేశ్వర్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

ఆదాయ వనరులపై దృష్టి సారించాలి



ఆయిల్ పామ్ మొక్కలు నాటుతున్న అధికారులు

హుజూరాబాద్‌రూరల్: రైతుల అదనపు ఆదాయ వనరులపై ప్రత్యేక దృష్టి సారించాలని హుజూరాబాద్ హార్టికల్చర్ అధికారి ఐలయ్య అన్నారు. శనివారం ఇప్పలనర్సింగాపూర్‌లో రైతు గూడూరి మల్లారెడ్డి వ్యవసాయ క్షేత్రంలో ఆయిల్ పామ్ మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నాటిన నాలుగేళ్ల నుంచి ముప్పై ఏళ్లవరకు ఆదాయం వస్తుందని, చీడపీడల బెడద తక్కువని తెలిపారు. కూలీల సంఖ్య తక్కువని, అంతర పంటల సాగు చేసుకోవచ్చన్నారు. పంట మార్పిడిలో భాగంగా ఆయిల్ పామ్ సాగుకు దరఖాస్తు చేసుకోవాలని, ప్రభుత్వ రాయితీలను వివరించారు. వెంట ఏఈవో సతీష్ రెడ్డి ఆయిల్ ఫామ్ ఫీల్డ్ అధికారి వేణు, రైతులు పాల్గొన్నారు.

ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలి



వినతిపత్రం ఇస్తున్న రవీందర్, ముదిరాజ్‌లు

చిగురుమామిడి: మండలంలోని ఆయా గ్రామాల్లో చెరువు, కుంటలు అన్యాక్రాంతం కాకుండా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని జెడ్పీటీసీ గీకురు రవీందర్ అన్నారు. శనివారం చిగురుమామిడిలోని తుపాకులకుంటలోని 1178 సర్వే నంబర్‌లో 1.12 ఎకరాల భూమిని రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఆక్రమించుకున్నారని ఆరోపించారు. ఆక్రమణదారులపై తగిన చర్యలు తీసుకోవాలని ముదిరాజ్ సంఘం నాయకులతో కలిసి తహసీల్దార్ ముబీన్‌అహ్మద్‌కు వినతిపత్రం అందించారు. ఏళ్లుగా తుపాకుల కుంటలో ముదిరాజ్‌లు చేపలతో జీవనోపాధి పొందుతుండగా, రెండు రోజుల క్రితం వ్యాపారులు కుంట కట్టను ధ్వంసం చేశారని, తక్షణం వారిపై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. వెంట సర్పంచ్ బెజ్జంకి లక్ష్మణ్, మండల ముదిరాజ్‌మహాసభ అధ్యక్షుడు పెసరి రాజేశం, నాయకులు చెరుకు సంజీవ్‌కుమార్, గందె చిరంజీవి, జక్కుల బాబు, పొన్నం వెంకటరాజయ్య, పోగాకుల రమేష్, సతీష్, రాములు, పొన్నం బాలయ్య, పర్శరాములు, మల్లయ్య పలువురు ఉన్నారు.

నత్తనడకన పనులు



మాట్లాడుతున్న మేడిపల్లి సత్యం

గంగాధర: అధికారుల నిర్లక్ష్యంతో నారాయణపూర్ చెరువు గండి పూడ్చివేత పనులు నత్తనడకన సాగుతున్నాయని, ముంపు గ్రామాల సమస్యలు పరిష్కరించడంతో ఎమ్మెల్యే రవిశంకర్ విఫలమయ్యారని చొప్పదండి నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి మేడిపల్లి సత్యం దుయ్యబట్టారు. శనివారం గంగాధరలో మాట్లాడారు. వర్షాకాలంలో నారాయణపూర్ చెరువుకు గండిపడడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారని, సాగుభూములు బీడువారాయని, నారాయణపూర్, మంగపేట, చెర్లపల్లి(ఎన్), ఇస్తారిపల్లి గ్రామాలను ముంపు గ్రామాలుగా ప్రకటించి, ఆర్అండ్ఆర్ ప్యాకేజీ కింద పరిహారం అందజేయాలన్నారు. యాసంగి సాగుకు నీరందివ్వడంపై రెండు రోజుల్లో ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. రైతుబీమా ప్రొసీడింగ్స్, కల్యాణలక్ష్మి చెక్కులు పంచడమే అభివృద్ధి కాదని, గండి పూడ్చివేతపై స్పష్టమైన హామీ ఇవ్వని పక్షంలో రైతుల పక్షాన కాంగ్రెస్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ముట్టడిస్తామని హెచ్చరించారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బుచ్చయ్య, చొప్పదండి మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, కిసాన్ సెల్ అధ్యక్షుడు గంగయ్య, రాజిరెడ్డి,లచ్చయ్య, శ్రీనివాస్‌రెడ్డి, భాస్కర్, తోట కరుణాకర్, మహేశ్, రేండ్ల రాజిరెడ్డి, మంత్రి మహేందర్, సతీష్ పాల్గొన్నారు.

ఏసీడీ చార్జీలు తగ్గించాలని రాస్తారోకో



వీణవంకలోని విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట బైఠాయించి ధర్నా చేస్తున్న బీజేపీ నాయకులు

సాక్షి నెట్‌వర్క్: గృహ అవసరాలకు వినియోగించే విద్యుత్ ఏసీడీ చార్జీలు తగ్గించాలని శనివారం బీజేపీ నాయకులు రాస్తారోకో చేశారు. ఉచిత విద్యుత్ పేరుతో ఏసీడీ రూ. మూడువేల వరకు వసూలు చేస్తున్నారని వారు ఆరోపించారు. తక్షణం తగ్గించని పక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. వినియోగదారులపై ప్రభుత్వం ముందస్తు డిపాజిట్లు వసూలు చేయడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు చేసేది తక్కువ, దోచుకునేది ఎక్కువన్నారు. విద్యుత్ శాఖ అధికారులకు వినతిపత్రం సమర్పించారు. పేద, మధ్య తరగతి ప్రజలపై భారం పడుతుందన్నారు. పావలా ఖర్చు చేసి, ముప్పావల దోచుకుంటుందన్నారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. విద్యుత్ రంగంలో దేశానికి ఆదర్శంమని, రైతులకు 24 గంటల ఉచిత కరెంట్ ఇవ్వకున్న గొప్పలు చెప్పుకుంటున్న సర్కార్‌పై మండి పడ్డారు. రాబోయే రోజుల్లో తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు.

తెగుళ్ల నివారణకు చర్యలు చేపట్టాలి



వరిని పరిశీలిస్తున్న ఏఈవో రాంప్రసాద్

జమ్మికుంట: వరిలో తెగుళ్ల నివారణకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఏఈవో రాంప్రసాద్ అన్నారు. మండలంలోని అంక్షాపూర్ గ్రామంలోని వరిపంటలను శనివారం పరిశీలించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ కాండం తొలుచు పురుగు, సూక్ష్మ పోషకాల లోపం ఎక్కువగా ఉందని నివారణకు సూచించిన మందులు పిచికారీ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రైతులు నోముల శ్రీను, విడే రాజుతోపాటు తదితరులు పాల్గొన్నారు.

చిగురుమామిడి: మండలంలోని వివిధ గ్రామాల్లో దెబ్బతిన్న వరి పంటలను జమ్మికుంట కృషి విజ్ఞాన కేంద్రం వ్యవసాయ శాస్త్రవేత్తలు వెంకటేశ్వర్‌రావ్, మహేశ్ పరిశీలించారు. ఏఓ రంజిత్‌కుమార్‌తో కలిసి చీడపీడల నివారణకు తగిన సస్యరక్షణ చర్యలు తీసుకోవాలని రైతులకు సూచించారు. ఆయా గ్రామాల ఏఈఓలు, రైతులు తదితరులున్నారు.

మత్స్యగిరీంద్రస్వామి ఆలయానికి రూ.50వేల విరాళం



విరాళం అందిస్తున్న కుటుంబ సభ్యులు

శంకరపట్నం: మండలంలోని కొత్తగట్టు మత్స్యగిరీంద్రస్వామి ఆలయానికి శనివారం ఆర్మూర్‌కు చెందిన మౌనిక,భీమ్ దంపతులు, కుమారులు రూ.50వేల విరాళం ఆలయ అర్చకుడు శేషం మురళీదారాచార్యులు, మాధవాచార్యులకు అందించారు. మత్స్యగిరీంద్రస్వామి బ్రహ్మోత్సవాలు పురస్కరించుకుని ఆలయం అభివృద్ధికి వినయోగించాలని సూచించారు.

యువజన క్రీడోత్సవ పోటీలు ప్రారంభం



క్రీడకారులను పరిచయం చేసుకుంటున్న ఎంఈవో

హుజూరాబాద్: పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో నెహ్రూ యువకేంద్రం కరీంనగర్, యువశక్తి యూత్ అసోసియేషన్ రాజాపల్లి ఆధ్వర్యంలో యువజన క్రీడోత్సవ పోటీలను శనివారం ఎంఈవో కేతిరి వెంకట నరసింహారెడ్డి, ఎన్‌వైకే డిస్ట్రిక్ కో ఆర్డినేటర్ వెంకట రాంబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా క్రీడాకారులను పరిచయం చేసుకొని గెలుపోటములు సమానంగా స్వీకరిస్తూ ముందుకెళ్లాలన్నారు. కార్యక్రమంలో కబడ్డీ జిల్లా అసోసియేషన్ ప్రెసిడెంట్ సారయ్య, యువశక్తి యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు మునిగాల అశోక్, అసోసియేషన్ అధ్యక్షులు ఎం.రవీందర్, మండల అసోసియేషన్ తాళ్లపల్లి శ్రీనివాస్,టీజీపీఈటీఏ జిల్లా వైస్ ప్రెసిడెంట్ వెంకటరెడ్డి, జిల్లా అసోసియేషన్ జాయింట్ సెక్రెటరీ అంజయ్య, మండల హాకీ క్లబ్ ప్రెసిడెంట్ శ్రీనివాస్, పీఈటీలు, యూత్ సభ్యులు పాల్గొన్నారు.

పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా చంద్రయ్య



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న సభ్యులు

జమ్మికుంట: తెలంగాణ పెన్షనర్స్ అసోసియేషన్ మండల అధ్యక్షుడిగా నరిగె చంద్రయ్య, ప్రధాన కార్యదర్శిగా కట్ట నాగభూషణ్‌చారిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శనివారం పట్టణంలో అసోసియేషన్ మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యక్షుడిగా రాంచంద్రయ్య, కార్యవర్గ సభ్యులుగా వీరయ్య, రామస్వామి, రాజయ్య, ఈశ్వరయ్య, సత్యనారయణ, రాంబ్రహ్మం, తదితరులు ఎన్నికయ్యారని ప్రకటించారు. అనంతరం వార్షిక క్యాలెండర్‌ను ఆవిష్కరించారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

హుజూరాబాద్ : పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయ ఆవరణలోని ఏటీవో కార్యాలయ సమీపంలో తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్‌కు సంబంధించిన క్యాలెండర్, డైరీని హుజూరాబాద్ శాఖాధ్యక్షుడు శివరాత్రి ఈశ్వరయ్య ఆధ్వర్యంలో ఏటీవో మోహిన్ జహాన్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంఘం గౌరవ అధ్యక్షుడు చందుపట్ల జనార్దన్ మాట్లాడుతూ ఉద్యోగులకు, పెన్షనర్లకు రావాల్సిన మూడు డీఏలను ఇంతవరకు రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేయకపోవడం సరికాదని, డీఏలను వెంటనే విడుదల చేయాలని కోరారు. నూతన పీఆర్‌సీ కమిటీని వెంటనే నియమించాలని కోరారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి చీకట్ల సమ్మయ్య, కోశాధికారి మండల వీరస్వామి, కమిటీ సభ్యులు మునిగంటి వెంకటేశ్వర్లు, తాటిపాముల కనకయ్య, ప్రభాకర్, సనత్‌కుమార్, బొంగోని వెంకటయ్య, బుచ్చి రాజాం, తాళ్లపల్లి రామకృష్ణ తదితరులు ఉన్నారు.

దాతల సాయం.. కల సాకారం

- ఆలయానికి 11 వందల ఏళ్ల చరిత్ర
- అబాది జమ్మికుంటలో చాళుక్యుల కాలంలో నిర్మించినట్టు శాసనం
- నేటి నుంచి 24వ తేదీ వరకు విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాలు

శ్రీ లక్ష్మీచెన్నకేశవస్వామి దేవాలయం పునర్నిర్మాణం



పూర్తయిన ఆలయ నిర్మాణం, (ఇన్‌సెట్లో)శ్రీ లక్ష్మీచెన్నకేశవస్వామి మూల విరాట్, ఉత్సవ విగ్రహాలు

జమ్మికుంట: మున్సిపల్ పరిధి అబాది జమ్మికుంటలో వందల ఏళ్ల క్రితం చాళుక్య రాజులు నిర్మించిన శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి దేవాలయం పునర్నిర్మాణ పనులు పూర్తయ్యాయి. భక్తుల సంకల్ప బలం, దాతల సాయంతో జీర్ణోద్ధరణ చేయగా సంవత్సరాల కల సాకారమైంది. నేటి నుంచి 24 వరకు విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించనున్నారు.

దమ్మికుంట కాలక్రమేణా జమ్మికుంట

కాకతీయుల కంటే ముందు చాళుక్యుల పరిపాలనలో జమ్మికుంటను దమ్మికుంట అని పిలిచేవారు. జమ్మికుంట(అబాది జమ్మికుంట)లో శ్రీమహాదేవ లింగేశ్వర స్వామి దేవాలయం, చెన్నకేశవస్వామి ఆలయం నిర్మించారని శ్రీమహాదేవ లింగేశ్వరస్వామి ఆలయంలోని దీప స్తంభంపై కన్నడ, తెలుగు కలగలిపిన శాసనం ఉంది. అప్పటి పశ్చిమ చాళుక్య రాజు అహోమల్లదేవుడు ఈ శాసనం వేయించారని, ఓ రాజ్యంపై దండెత్తి విజయం సాధించడంతో రెండు దేవాలయాలు నిర్మించారని శాసనంలో పేర్కొన్నారు. చాళుక్యులకు జమ్మికుంట సైనిక స్థావరంగా ఉండేదని, శాసనంలో జమ్మికుంట పేరు దమ్మికుంటగా ఉందని, 1980లో శ్రీ మహాదేవ లింగేశ్వరస్వామి దేవాలయంలో సుమారు వంద తాళపత్ర గ్రంథాలు బయటపడ్డాయని సమాచారం. కాలక్రమేణా మహాదేవలింగేశ్వరస్వామి దేవాలయం చెక్కు చెదరలేదు. కానీ రజాకార్ల పాలన కాలంలో చెన్నకేశవస్వామి ఆలయం ధ్వంసమైంది. అప్పటి నుంచి పూజలు, ఇతర కార్యక్రమాలకు నోచుకోకపోవడంతో శిథిలావస్థకు చేరింది. స్థానిక యువకులు, దాతల సాయంతో ఆగస్టు 22 జీర్ణోద్ధరణతో ఆలయ పునర్నిర్మాణానికి సంకల్పించారు. నేటి నుంచి మంగళవారం వరకు శ్రీ స్వామి బ్రహ్మనంద సరస్వతి, శ్రీపీఠం దివ్య ఆశీస్సులతో విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాలు నిర్వహిస్తామని, ఆలయ అర్చకులు ఎలబాక రాజేశ్వరశర్మ, డింగరి ప్రవీణాచార్యులు పూజల్లో పాల్గొంటారని ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు తెలిపారు. దైవ సంకల్పంతో మూడు నెలల్లో ఆలయ పునర్నిర్మాణ పనులు పూర్తి చేశా. దాతలు సుమారు ఇరవై లక్షల వరకు విరాళం అందించారని ఆలయ కమిటీ కార్యనిర్వాహక కార్యదర్శి ఆకుల రాజేందర్ తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. పురాతన ఆలయ పునర్నిర్మాణంలో భా గస్వామ్యం, భక్తి భావంతో లక్ష నూట పదహారు రూపాయలు అందజేశానని, త్వరగా ఆలయ నిర్మాణ పనులు పూర్తి చేసి విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు చేపట్టడం సంతోషంగా ఉందని వ్యాపారి ఆకుల రాజయ్య అన్నారు.

అభివృద్ధి పనులకు ఏకగ్రీవ ఆమోదం

హుజూరాబాద్: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం సమావేశ మందిరంలో శనివారం మున్సిపల్ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా 24 అంశాలను ప్రస్తావించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ గందె రాధిక మాట్లాడుతూ... పట్టణంలో మూడు నెలల పనులకు రూ. 1.80 లక్షలు, ఆరు మినీ ట్రాలీలు కొనుగోలుకు రూ. 37 లక్షలు, కేసీ క్యాంపులోని మహాత్మ గాంధీ పార్క్ వద్ద ఫెన్సింగ్ ఏర్పాటుకు రూ. 3.80 లక్షలు, దోమల నివారణకు రెండు ఫాగింగ్ మిషన్లు కొనుగోలుకు రూ. 1.77 లక్షలు, రూ. 4. 60 లక్షలతో పర్కాల్ క్రాస్ వద్ద జంక్షన్ అభివృద్ధి పనులకు కౌన్సిల్ సభ్యులు లామోదం తెలిపారు. కార్యక్రమంలో కమిషనర్ సమ్మయ్య, వార్డు కౌన్సిలర్లు పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
కరీంనగర్ జిల్లా :
9951602933, 9951602958, 9951602824
Office mail : knrjagati@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
రమేష్, ACO - 7997958214
కరీంనగర్ : రాజశేఖర్ - 9618304759
చొప్పదండి : ముండయ్య - 7997958217
మానకొండూర్ : మహేశ్ - 9573106760
హుజూరాబాద్ : ప్రశాంత్ - 7331119941
టోల్ ఫ్రీ నెం.: 1800 425 9899